
కథ

# భలే మంచి చౌక బేరము

ఆదూరి వెంకట సీతారామమూర్తి

"ఆరునూరైనా నూరు ఆరైనా
యీమారు నా మాట
మీరు వినితీరాల్సిందే"
అంది అనంత లక్ష్మి.
"ఏ మాట?"
అన్నాడు విశ్వనాథం పేపర్లోంచే.
"ఇది చూడండి"
అంటూ విశ్వనాథం చేతుల్లోని
మెయిన్ పేపర్ని లాక్కుని
జిల్లా ఎడిషన్ అతని చేతికందించి
ఆరో పేజీలో చివరనున్న
ప్రకటన మీద చూపుడు వేలుంచి
చూపించింది.
"మీ ఇంట్లో
మీకు పనికిరాని వస్తువులు,
పాత సామాన్లు-ఫర్నిచరు,
ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు,
బట్టలు, పేపర్లు- ఏవైనా సరే
మా కిచ్చి వాటి విలువను
రెట్టింపు చేసుకోండి.
మా వద్దనున్న కొత్త సామాన్లు
తీసుకువెళ్లి మీ ఇంటిని
కొత్త కొత్తగా మెరిపించండి.





ఈ అవకాశం నాల్గురోజులు మాత్రమే! వివరాలకు సంప్రదించండి'' – అని వుందా ప్రకటన.

''ఈ రోజుల్లో న్యూస్ పేపర్లూ, టీవీ ఛానల్సూ అన్నీ కొట్లాటల వార్తలతో నిండిపోతున్నాయి. ఇంతకీ ఏమిటంటావ్'' అన్నాడు ఏమీ ఎరగని వాడిలా ముఖం పెట్టి.

''బాగానే వుంది. రామాయణమంతా విని సీత ఎవరన్నట్లుంది మీ ప్రశ్న. ఇంట్లోకి కొత్త సామాను ఎప్పుడు కొనుక్కుందామన్నా ఉన్న యీ పాత సామగ్రిని ఏం చేసుకుంటామన్న సమస్యే ఎదురౌతుంది. పాతవి, మనకి పనికిరానివీ వాడు తీసుకుంటానంటే హాయిగా యిచ్చేసి మనక్కావాల్సిన కొత్త వాటిని మనం కొనుక్కోవచ్చుగదా. పాత వస్తువుల మీద పెంచుకున్న సెంటిమెంట్లని పక్కకు తీసి పెట్టి కొత్త వాటికోసం ఒకడుగు ముందుకు వేస్తే మంచిదేమో ఆలోచించండి'' అంది అనంతలక్ష్మి.

''ఇందులో ఏదో మతలబు వుండే వుంటుంది అనంతం. లేకపోతే మనకి కూడా పనికిరాని వస్తువుల్ని తీసుకుని వాడేం చేసుకుంటాడు చెప్పు? పైగా కొత్తవి ఎక్స్ఛేంజ్‌గా యిస్తానంటాడా, ఎంత తలకి మాసిన వాడైనా! వాడి దగ్గరున్న వస్తువులేవో అర్జంటుగా వదలగొట్టుకోడానికి యీ ప్లాన్ వేసివుంటాడు''

''పోనీ అలాగే అనుకొన్నా మనం కూడా మనకి అక్కర్లేని సామాన్ని వదలగొట్టుకోవచ్చు గదా'' అంది అనంతలక్ష్మి అతని మాటలకు అడ్డేస్తూ.

''సరే నువ్వు వదలుగొట్టుకోవాలనుకుంటున్నవి ఎలాంటివో చెప్పు?''

''మనింట్లో పాతకాలం నాటి ఫర్నిచరు బోల్డు వుంది. చైనా వారి వాస్తుశాస్త్రం ప్రకారం ఇంట్లో పనికిరాని సామాన్లుంటే ఆరోగ్యాన్నీ, అభివృద్ధినీ హరిస్తాయట''

''మన వాస్తు శాస్త్రం మీదా, మన జ్యోతిషశాస్త్రం మీదా మనకే నమ్మకాలు కుదరని యీ రోజుల్లో చైనావాడి వాస్తుశాస్త్రం ఒకటా...''

''ముందు నే చెప్పేది వింటారా వినరా. ఇంట్లో కాలువిరిగిన ఓ కర్ర కుర్చీ వుంది. దానికి మరమ్మత్తు కూడా చేయించాం. కానీ దానిమీద యిప్పుడు ఎవరు కూర్చుంటున్నారు చెప్పండి? పైగా అది అవుకుగానే వుంది. అది మొదలు ఇంట్లోంచి నడిచెయ్యాలి''.

''అవుకుగా వుందంటే వుండదా? మీ వూరికి చెందిన కార్పెంటరని జాలిపడి పిలిచావు. వాడికి కర్రతో మేకు దిగ్గొట్టడమే రాదు. మేకు నేను పట్టుకుంటే తను సుత్తితో కొడతానన్నాడు. అదీ వాడి పనితనం! ఎవరేనా తీసుకుంటానంటే ఆ కుర్చీ ఇచ్చేయడానికి నాకేం అభ్యంతరం లేదు''. విశ్వనాథం ఆ మాట అనడంతో కాస్త ధైర్యం వచ్చింది అనంతలక్ష్మికి.

''ఇక రెండోది– అటక మీద వున్న పాతకాలం నాటి చెక్క ఉయ్యాల మంచం. అందులో మీరు చిన్నప్పుడు వూగీవూగీ ఉగ్గుపాలు తాగీతాగీ బబ్బునే వారనుకుంటాను– కాని ఇప్పుడది మనం వాడం. ఆ మాటకొస్తే మనింట్లోనే కాదు ఏ యింట్లోనూ ఎవరూ యీ కాలంలో వాడరు. అవునా?''

విశ్వనాథం ఒక్కక్షణం ఆలోచించి ''సరే దాన్ని పంపిచెయ్'' అన్నాడు.

''పోతే ఈ ఇంట్లో కొచ్చేముందు పెట్టుకోడానికి జాగా లేక విడగొట్టి అటకమీద పెట్టేసిన పట్టెమంచం. అది వాడతామా చెప్పండి''

విశ్వనాథం కాస్త సర్దుకొని, ''దానికేం? ఇప్పుడు కాకపోతే ఎప్పుడేనా వాడొచ్చు. టేక్‌వుడ్‌తో చేసిందది. మా అమ్మ వాళ్ళ పుట్టింటి నించి తెచ్చుకుందట– ఆమె ఉన్నన్నాళ్ళూ దాన్ని ప్రాణప్రదంగా చూసుకునేది. దిగ్గొట్టి పట్టెడ వేస్తే దాని సొగసేవేరు. దాని సుఖమే వేరు''

''నిజమే కావొచ్చు. కానీ ఆ పని ఎవరు చేస్తారు? మన పిల్లలు కాలేజీ హాస్టల్‌నించి ఇంటికొచ్చిన ఆ నాలుగు రోజులూ కిందనైనా పడుకుంటారుగానీ దాన్ని ఉపయోగించరుకదా. ముందుముందుకూడ వాళ్లు దాన్ని వాడే అవసరం రాదు'' అంది అనంతలక్ష్మి నిశ్చయంగా.

''ఏమైనా...కర్రమంచిది. మంచం నిక్షేపంలా వుంది. దానిని యీ సారికి క్షమించి వదిలెయ్'' అన్నాడు విశ్వనాథం.

''సరే దాన్ని మీ కోసం వదిలేస్తున్నాను... ఇక పోతే... అటకమీద చిల్లుపడ్డ ఇత్తడి బిందె ఒకటి వుంది...'' అంటూ ఆగింది.

''దానికేం...చిల్లుకు మాటువేయించి తోమిస్తే బంగారబ్బిందెలా వుంటుంది. ఇప్పటి స్టీలు బిందెలతో రెండు బిందెల నీళ్ళు పడుతుంది ఎంచక్కా'' అన్నాడు విశ్వనాథం.

''ఉంటుందేమోగాని దానికి వారానికి అరకేజీ చింతపండు కావాలి తోమడానికి. పైగా దాన్ని తీసుకెళ్ళి నీళ్లు తీసుకురావడానికి పెరట్లో వున్న కొళాయి నించైనా సరే మనిషి కోడి రామ్మూర్తి లెవెల్లో వుండాలి. నా తరంగాదు. క్షమించెయ్యండి'' అంది అనంతక్ష్మి నవ్వుతూ. విశ్వనాథం నవ్వలేదు.

''రేప్పొద్దున్న నీకో మనవరాలు పుట్టి, 'ఇత్తడి బిందె అంటే ఏంటి అమ్మమ్మా' అనడిగితే ఏం చెబుతావ్? పాత సంప్రదాయ వస్తువులు మంటగల్సిపోవలసిందేనా?''

''పాత బిందె మన సంప్రదాయవస్తువుల జాబితాలోకి వస్తుందోరాదో నాకు తెలీదు గానీ ఒక వేళ యీ బిందే వున్నా నా మనవరాలు అడిగినా దీన్ని చూపించనుగాక చూపించను''

''ఏంచేతో?''

''ఇత్తడి బిందె అంటే పెంకులా యింత నల్లగా వుండి పైనా కిందా కన్నులు ఉండాలి కాబోలు అనుకుంటుందది. అందుకూ'' అంది నవ్వుతూ.

విశ్వనాథానికీ నవ్వొచ్చింది కానీ దాన్ని అదిమి పెట్టి ''నవ్వకు అది యీ యింట ఎన్ని తరాల్ని చూసిందో ఎంత వైభోగం అనుభవించిందో పిల్లకాకివి నీకేంతెల్సు'' అన్నాడు.


''నేనీ ఇంటికి వచ్చిందగ్గర్నించీ చూస్తున్నాను. దాని ఉచ్ఛస్థితిని'' అంటూ అటకవైపు చూసింది అనంతలక్ష్మి.

''నవ్విన వూళ్లే పట్టాలవుతాయి అన్నట్టు చూస్తూండు. రేప్పొద్దున్న మన అదృష్టం బాగుండి ఏ 'ఆహో ఓహో' ఛానల్లోనో మనకి పాల్గొనే ఛాన్సు వచ్చి మనింట బంగారు కాసులు కురిశాయనుకో. ఆ బంగారు కాసులన్నిట్నీ ముందుతరాల వారి కోసం బిందెలో పోసి పెరట్లో పాతి పెట్టడానికి యీ బిందే నీకు గతి అవుతుందేమో! అంచేత అదొద్దులే. దాన్నొదిలెయ్'' అన్నాడు విశ్వనాథం.

''మీరారూట్లో వచ్చేరా? సరే. దానికింత అదృష్టం పట్టబోతూవుంటే మధ్య నేనెవర్ని అడ్డుకోడానికి? వదిలేద్దాం లెండి! మరి..పాత బట్టలనైనా బయటకు పంపే ఉద్దేశ్యమేదైనా వుందా లేక పుట్టబోయే మనవల పక్కబట్టలకోసం దాచేద్దామంటారా?''

''అలా అడిగావ్ బాగుంది. నా బట్టలు తప్ప మిగిలిన బట్టలు మీ ఇష్టం. అయితే ఒకటీ... కనీసం షాపుకెళ్లి కొనుక్కొచ్చేవరకైనా ఒకట్రెండు చీరలు

## వెజిటేరియన్ - నాన్ వెజిటేరియన్



లవకుశ సినిమాలో రమణారెడ్డిది వాల్మీకి ఆశ్రమంలో శిష్యుడి పాత్ర. ఒక సన్ని వేశంలో ఆయన సింహంతో నటించవలసి వచ్చింది. వూళ్లో వున్న ఒక సర్కస్ కంపెనీ నుంచి సింహాన్ని తెప్పించారు. రౌద్రంగా అరుస్తోంది అది. ఈ బక్కమనిషి ఒకటే వణికిపోవడం. ట్రైనర్ ఆయన దగ్గరకువచ్చి ధైర్యంచెప్పే ప్రయత్నాలు ఆరంభించాడు. 'అది చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకుంది సార్. పోతపాలుపోసి పెంచాం. చాలా సాధువు. మిమ్మల్నేమీ చెయ్యదు' అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు. అతన్ని మధ్యలోనే అడ్డుకుంటూ రమణారెడ్డి 'చిన్నప్పుడు నన్నూ పోతపాలు మీదే పెంచారయ్యా. మరి ఇప్పుడు కోడిమాంసం లేనిదే ముద్ద దిగదే' అన్నాడు. ట్రైనర్ మారు మాట్లాడితే వొట్టు.

వుంచుకో. లేకపోలే కష్టమైపోతుంది'' అన్నాడు విశ్వనాథం ముసిముసిగా నవ్వుతూ.

''సంతోషించాంగానీ ఆ ప్రకటన యిచ్చినవాడికి ముందు ఫోన్ చేసి వివరాలు ఏం చెబుతాడో కనుక్కోండి'' అంది అనంతలక్ష్మి.

''వాడికి ఫోనొకటా? సెల్లే... నేను నెంబరు కొట్టి యిస్తాను. నువ్వే మాట్లాడు'' అంటూ పేపర్లో యిచ్చిన నెంబర్‌కి డయల్ చేసి అనంతలక్ష్మికి అందించేడు.

అనంతలక్ష్మి కొన్ని ప్రశ్నలు వేసి వాడి దగ్గర్నుండి కొన్ని వివరాలు కనుక్కుంది తర్వాత విశ్వనాథంతో చెప్పింది.

''పాత సామాన్లు వాళ్ళు కొనే రేట్లు వింటూంటే నమ్మబుద్ధికావడం లేదు. న్యూస్ పేపర్లు కేజీ నలభై రూపాయలట- ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్ వస్తువులు కేజీ ఇరవై ఐదు రూపాయలు. ఇత్తడి, స్టీలు సామాన్లు అసలు పుచ్చుకోరట. పాతబట్టలు కేజీ వందరూపాయలట- ఇలా పాత వస్తువులకు ధరలుకట్టి వాటికి తగ్గ కూపన్లు యిచ్చి కొత్తవస్తువుల ధరలు మీద అవికొన్నప్పుడు ఆ మేరకు తగ్గిస్తారుట'' అని చెప్పి ''ఇలా చూస్తే మన పాత వస్తువులమీదా, కర్రసామగ్రి మీదా ఎలా లేదన్నా ఏడెనిమిది వందల రూపాయల విలువగల కూపన్లొస్తాయి - వాడికి యిందులో ఏం మిగులుతుందో మరి. ఆనక యీ చెత్తంతా ఏం చేసుకుంటాడో ఏమిటో'' అంది.

''ఇంతకీ యీ వ్యవహారమంతా ఎక్కడో ఏమిటో కనుక్కున్నావా?''

''ఓ... మూతబడ్డ మన పాత లక్ష్మీటాకీసులో నట సామానంతా పట్టొద్దూమరి!''

* * *

మర్నాడే ఇంట్లో పనికి రావనుకున్న పాతసామగ్రినంతా పాత బట్టలమూటతో సహా పనిమనిషి సాయంతో ఒక దగ్గర చేర్చింది అనంతలక్ష్మి. విశ్వనాథం ఆఫీసు నుండి నాలుగు గంటలకల్లా వచ్చేడు. వస్తూనే పరుపులుకుట్టే సాయిబు దుకాణం ముందుండే ప్లాట్ రిక్షా నొకదాన్ని బేరమాడి తెచ్చాడు.

రిక్షా సామానుతో బయల్దేరిందో లేదో ఎదురింటావిడ అడగనే అడిగింది ''మాతో చెప్పకుండానే ఇల్లు ఖాళీ చేసేస్తున్నారా?'' అని

ఆవిడకు జవాబు చెప్పి రిక్షా వెనకే మోపెడ్ మీద బయల్దేరారు విశ్వనాథం, అనంతలక్ష్మి.

లక్ష్మీటాకీస్ దగ్గర సామాను దింపగానే లోపల్నించి యిద్దరు ఖాకీబట్టలేసుకున్న వాళ్లు వచ్చి సామాను లోపలికి చేర్చి, తరగతుల వారీగా విభజించి తూకం వేసి వాటి బరువుల్ని నిర్ధారించేరు. కౌంటర్లో కూర్చున్న మరొకాయన వాటికి విలువల్ని కట్టి కూపన్లు తీసి స్టాంపులేసి అందించేడు. అక్కడి హంగామా చూస్తుంటే వరదప్రాంతంలోని శరణార్థుల శిబిరం గుర్తుకొచ్చింది విశ్వనాథానికి.

కొత్తసామాను మర్నాడొస్తుందని చెప్పడంతో పాతవి వదలగొట్టుకోవడం అనే ఒక పనయ్యింది గదా. తర్వాత తీరిగ్గా కొత్తవి కొనుక్కోవచ్చునన్న సంతృప్తితో తిరుగుముఖం పట్టారు.

కొత్తవస్తువులు ఏవేం అవసరమో కూపన్ల విలువకాక యింకా సుమారుగా తామెంత వెచ్చించదలచారో ఆ రాత్రే ఓ నిర్ణయానికి కొచ్చేశారు.


మర్నాడు శనివారం కావడంతో విశ్వనాథం ఆఫీసు నుండి మూడు గంటలకే వచ్చేశాడు. కాస్సేపు విశ్రమించి లేచేసర్కి అనంతలక్ష్మి ఉల్లిపాయ పకోడీలు చేసి టీ పెట్టింది. అల్పాహారం కానిచ్చి నెమ్మదిగా బయల్దేరారిద్దరూ.

పాత లక్ష్మీటాకీసులో కొత్తసామాన్లు ధగధగలాడిపోతున్నాయి. మొదట ఫర్నిచర్ వుంచినవైపుగా వెళ్ళేరు. అనంతలక్ష్మి, విశ్వనాథం. కుర్చీలూ, సోఫాలూ డైనింగ్ టేబుళ్ళూ డ్రెస్సింగ్ టేబుళ్ళూ, డబుల్‌కాట్ (మంచాలూ), అందంగా మిలమిల్లాడిపోతున్నాయి. ఏ వస్తువు ఏ కర్రతో తయారైందో వివరంగా చెబుతున్నాడు అక్కడున్న సేల్స్‌బోయ్.

''మనం మనపాత టీవీ స్టాండునుకూడా యిచ్చేయ్యాల్సిందండీ'' అంది అనంతలక్ష్మి.

ఏదో గుర్తొచ్చిందానిలా...అంటూ ''ఈ టీవీ స్టాండు చూడండి ఎంత బావుందో'' అంది

''పాతదైనా మనది టీక్‌వుడ్‌తో చేసింది. పాలిష్



## వారం రోజుల్లో నందనవనం రెడీ!!!

**1957**లో అక్కినేని నాగేశ్వరరావు తన చలనచిత్ర వజ్రోత్సవ వేడుకలను మదరాసులో అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మొదట ఈ వేడుకలకు వేదికగా అబట్స్‌బరీని ఎన్నుకున్నారు. అయితే వచ్చే అతిథుల సంఖ్య అమేయంగా పెరుగుతూ పోవడంతో తరువాత వేదిక విజయాధినేతల ఖాళీ గ్రౌండుకు మారింది. నాగిరెడ్డిగారి ఆజమాయిషీలో కేవలం వారంరోజుల వ్యవధిలోనే ఆ మైదానం చిన్న ఉద్యానవనం అయ్యింది. తరువాత అదే విజయా నందనోద్యానం అయింది. ఆనాడు ఈ వేడుకల ఏర్పాట్ల వ్యవహారం అంతా చూసింది అక్కినేని సన్నిహితుడు పేకేటి శివరాం, అక్కినేని వ్యక్తిగత కార్యదర్శి మల్లికార్జునరావు. ఈ ఉత్సవానికి ప్రజలు హాజరయ్యేందుకు వీలుకల్పిస్తూ ఆనాటి మదరాసు ప్రభుత్వం ప్రత్యేక బస్సులు కూడా వేసింది.





లేక అలా వుందిగానీ యీరోజుల్లో అటువంటిది కొనాలంటే మాటలా?'' అన్నాడు విశ్వనాథం.

అతని మాటలు విన్న సేల్స్‌బోయ్ ''ఇది కూడా మలేషియాటేక్‌తో చేసిందే సార్. రేర్‌పీస్. ధరకూడా ఎంతోలేదు. జస్ట్ ఐదువేల ఆరొందలు'' అన్నాడు.

ఆ మాటతో తెల్లగా అవాక్కయిన అనంతలక్ష్మి, విశ్వనాథం వంక చూసింది.

''మరేంటనుకున్నావ్'' అన్నట్టు చూశాడు విశ్వనాథం ఆమె వంక.

చెక్కబీరువాలూ, మంచాలూ, డ్రస్సింగ్ టేబుళ్ళూ చూస్తూ మనసుపడ్డా వాటి ధరలు చూసి ముఖం ముడిచేసింది అనంతలక్ష్మి.

ప్లాస్టిక్ కుర్చీలూ, వంటింటి సామాన్లు కాస్త అందుబాటు ధరల్లో వున్నా అలకాగా చీప్‌గా వున్నాయి. కొత్త, చిన్న కంపెనీలు తయారుచేసిన టేప్‌రికార్డర్లూ, డీవీడీప్లేయర్లూ, టీవీలు ఒక ప్రక్కన వున్నా వాటి వంక ఎవరూ చూడనైనా చూడ్డంలేదు. కావల్సినవి అందుబాట్లోలేక, అందుబాట్లోవున్నవి అవసరం లేకా ఏంచేయాలో తోచని పరిస్థితిలో వుండిపోయింది అనంతలక్ష్మి.

''గిల్టునగల కౌంటర్లో వడ్డాణాలూ వంకీ దండాలూ కూడా వున్నట్లున్నాయ్'' అన్నాడు విశ్వనాథం నవ్వుతూ. ''ఏం? జోకులా?'' అన్నట్టు చూసింది అనంతలక్ష్మి అతని వంక.

''శారీకౌంటర్ కూడ పెట్టినట్లున్నారు. పోనీ నీకు నచ్చిన ఓ మంచిచీర తీసేస్కో. నేనేం అనుకోను'' అన్నాడు నవ్వును దాచుకుంటూ.

''ఎన్నాళ్లకొచ్చింది మీ నోటంట ఆ మాట'' అన్నట్టు ఆశ్చర్యంగా ఆయన వంక చూసింది ''సరే మనకేది ప్రాప్తమో అదే'' అంటూ అటువైపు దారితీసింది.

శారీ కౌంటర్లో అన్నిరకాల చీరలూ వున్నాయి. ఊళ్ళపేర్లతో ప్రసిద్ధిచెందిన చేనేత చీరలూ, వాటి డూప్లికేట్లూ, పట్టుచీరలూ, పెట్టుబడి చీరలూ, పెట్లో దాపుడు చేసే చీరలూ, సాదా చీరలూ, పూసలూ, మెరుపులూ కుట్టిన చీరలూ చాలానే వున్నాయక్కడ. కానీ కాస్త మంచిదనుకున్న ఏ చీరా వెయ్యిరూపాయలకు తక్కువ ధరలో లేదు. చివరాఖరుగా అనంతలక్ష్మి ముచ్చటపడి తీసిన జరీఅంచు సిల్కుచీరకూడా పద్దెనిమిది వందలకు పైచిలుకే వుంది. ''నీ కిష్టమైతే తీసేస్కో. ఎలాగూ ఎనిమిది వందల రూపాయలకు తగ్గింపు కూపన్లు వున్నాయి గదా'' అన్నాడు విశ్వనాథం. అయితే అక్కడే...అప్పుడే...అసలు సంగతి తెల్సి యిద్దరూ ఆశ్చర్యంతో నోటమాటరాక వుండిపోయారు. పాతసామాన్లు యివ్వగా వచ్చిన కూపన్ల విలువకు ఐదురెట్లు విలువైన వస్తువులో, బట్టలో తీసుకుంటేనే ఆ తగ్గింపు వుంటుందట. దాని ప్రకారం కనీసం నాలుగువేల రూపాయల వస్తువులు గాని, బట్టలుగాని కొనుగోలుచేసితీరాలి.

''ఇదేం తిరాకసూ? ఈ సంగతి ముందుగా ఎందుకు చెప్పలేదూ?'' అంటూ కౌంటర్‌లోని సేల్స్‌మెన్‌ని నిలదీసింది అనంతలక్ష్మి.

''అడిగిన వాళ్ళందరికీ చెబుతూనే వున్నాం. మీ కిచ్చినకూపన్ల వెనుకా అచ్చువేయించాం. అక్కడక్కడ బోర్డులూ రాయించి పెట్టాం'' అన్నాడు అతను.

కూపన్ వెనుకపక్క చూసింది అనంతలక్ష్మి. చీమ తలకాయలకంటే చిన్న అక్షరాలలో ఓ యిరవై కండిషన్లు వున్నాయి కనీకనిపించకుండాను.

''పోనీ మా కూపన్లుతీసుకుని ఎంతో కొంత డబ్బిస్తారా లేక అదీయివ్వరా'' అడిగాంది కాస్త దబాయింపుగా.

''యివ్వరమ్మా అదీ ఆ వెనకే వుంది. చదువుకోకుండా వచ్చి యిక్కడ మమ్మల్ని అడిగితే ఎలా'' అన్నాడతడు కూల్‌గా.

అనంతలక్ష్మికి విషయం అర్ధమైంది.

''అయ్యో! ఆ పాటి తెలివే వుంటే యిలా మీ వలలో ఎందుకుపడతాం నాయనా. మా పాత సామాన్లతోపాటు యీ కాగితం ముక్కల్ని కూడ మీరే వుంచేసుకోండి'' అంటు కూపన్లను కౌంటర్లోకి విసిరేసి వెనుదిగింది అనంతలక్ష్మి.

★

